## క్లుప్తంగా

### హెల్త్‌సిటీలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి

**ఆరిలోవ :** ఆరిలోవ ప్రాంతంలో వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వార్డుల్లో పలుచోట్ల మండపాల వద్ద స్వామికి పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా హెల్త్ సిటీలో భగత్‌సింగ్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో నిర్వాహకులు శుక్రవారం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు భోజనాలు వడ్డించారు. చినగదిలి, దీన్‌దయాల్‌పురం, సంతపాలెం, ఆరిలోవ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు, ఆటో డ్రైవర్లు అన్నసమారాధనలో స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆటో స్టాండ్ అధ్యక్షుడు భాస్కర్, సభ్యులు రమేష్, అప్పన్న, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులతో ఆరోగ్యకర సమాజం



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, తదితరులు

**మహారాణిపేట :** ధూమపానానికి వ్యతిరేకంగా జిల్లాలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ హారిక శుక్రవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, కృషి, సామాజిక బాధ్యతతో పాఠశాలలు, సమాజంలో ధూమపాన వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారని కొనియాడారు. వారిని అభినందించడానికి ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు. యువ ప్రతిభావంతుల సేవలను జిల్లా అధికారులు అభినందించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

### గణపతి మండపంలో భజన



భజన చేస్తున్న విద్యార్థులు

**మద్దిలపాలెం :** స్థానిక లక్ష్మీనగర్‌లో క్రేజీబాయ్స్ యూత్ సభ్యులు, విద్యార్థులు కలిసి వినాయక ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు, కాలనీవాసుల సహకారంతో రోజూ వినూత్న కార్యక్రమాలతో ఆకట్టుకుంటున్నారు. విద్యార్థులు శుక్రవారం భక్తి గీతాలు ఆలపిస్తూ భజన చేశారు.

### సింహగిరిపై శ్రీనృసింహ హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై శ్రీనృసింహ హోమం ఘనంగా జరిపారు. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచారపూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, సాతులూరి నరసింహాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# చినుకు పడితే కునుకు కరువే

ప్రమాదకరంగా 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం, సింహాద్రిపురం, దుర్గానగర్

బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న కొండవాలు ప్రాంత ప్రజలు

కలగానే మిగిలిన రక్షణ గోడల నిర్మాణం



జీవీఎంసీ 15వ వార్డు పరిధి వెంకోజీపాలెంలో కొండపై నిర్మించిన ఇళ్లు

**మద్దిలపాలెం :** వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండవాలు ప్రాంతీయులకు కంటి మీద కునుకు కరువైంది. చినుకు పడితే చాలు చిగురుటాకులా వణికిపోతున్నారు. వర్షంతో కొండపై ఉండే రాళ్లు ఎక్కడ జారి పడతాయేనని భయపడుతున్నారు. విశాఖ తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో విస్తరించిన జీవీఎంసీ 15వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాలైన పాత వెంకోజీపాలెం, దుర్గానగర్, సింహాద్రిపురం ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు చినుకు పడితే చాలు గుండె జారిపోతోంది. వానొస్తే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వణికిపోతూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎటువంటి బండరాయి దొర్లుకుంటూ వచ్చి ఇంటి మీద పడుతుందో, ఏ గోడ కూలిపోతుందోనని ఆందోళన చెందుతూ కంటి మీద కునుకు లేకుండా బతుకుతున్నారు.

**వర్షాకాలంలో బాధలు వర్ణనాతీతం**

వర్షాకాలంలో కొంతవాడు ప్రాంతాల్లో నివసించే వారి బాధలు వర్ణనాతీతమనే చెప్పుకోవాలి. మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడడం, ఇళ్లకు వెళ్లడానికి సరైన మెట్లు లేక జారి పడడం, విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో కరెంటు షాక్ కొట్టడం, రక్షణ గోడలు లేక బండరాళ్లు దొర్లడం, విష సర్పాలు, క్రిమికీటకాలు ఇళ్లలోకి ప్రవేశించడంతో భయాందోళనకు గురవుతున్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలకు జీవీఎంసీ ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయకపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇక్కడి నుంచి ఖాళీ చేయాలంటూ అధికారులు భయపెడుతున్నరని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కొండలపై ఇళ్లు, ఇతర కట్టడాలు నిర్మించుకోవడం అనివార్యమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. ఉన్నంతలో అవసరమైన మేరకు భద్రతా చర్యలు చేపట్టి, రక్షణ గోడలు నిర్మించకపోవడంతో స్థానిక నివాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కొండవాలు ప్రాంత ప్రజల జీవనానికి భరోసా కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**శాశ్వత పరిష్కారం శూన్యం**

నగరం ఎంత శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా కొండవాలు ప్రాంత ప్రజలు మాత్రం రక్షణ గోడలు లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి బతుకులకు మాత్రం భరోసా లేకుండాపోయింది. భారీగా వర్షాలు కురిసి ఏదైనా ఘటన జరిగితే అధికారులు కొద్దిగా హడావిడి చేసి తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపించడం లేదు. కొండవాలు ప్రాంతాల్లోని ప్రజలు బతుకుజీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నా ప్రజా ప్రతినిధులు మాత్రం అటుగా తొంగిచూడడం లేదు. జీవీఎంసీ 15వ వార్డులో నివసిస్తున్న జనాభాలో స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది పేదలు కావడంతో అద్దె తక్కువ ఉంటుందని కొండవాలు ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు.



సింహాద్రిపురం కాలనీలో కొండను ఆనుకుని ఇళ్లు

# తెలుగు భాషను విస్మరించడం విచారకరం

**ఆందోళన వ్యక్తం చేసిన భాషాభిమానులు**



తెలుగు తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న తెలుగుదండు ప్రతినిధులు

**మద్దిలపాలెం :** గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నేపథ్యంలో తెలుగు దండు సూరి ఆధ్వర్యంలో భాషాభిమానులు, కళాకారులు మద్దిలపాలెం కూడలి వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి శుక్రవారం నీరాజనాలు అర్పించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా తెలుగు తల్లి శోభాయాత్ర నిర్వహించాలని భావించినప్పటికీ పోలీసులు అనుమతి నిరాకరించడంతో నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా భవిష్యత్ తరాలకు తెలుగు భాషను అందజేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తెలుగుదండు వ్యవస్థాపకుడు సూరి మాట్లాడుతూ ఉర్దూను సైతం అధికార భాషగా గౌరవించిన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషను పరిరక్షించకపోవడం విచారకరమన్నారు. తమిళనాడు, కర్ణాటక మొదలుకుని ప్రపంచమంతా గౌరవిస్తున్న తెలుగును, ఆ తల్లి బిడ్డలు దూరం చేసుకోవడం క్షమార్హం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి తెలుగు భాష పరిరక్షణ కోసం నడుము బిగించాలని సూచించారు. ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తామని సూరి తెలిపారు. భాషా పరిరక్షణను బాధ్యగా భావించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, బాధ్యతను విస్మరించడంతో త్వరలోనే తెలుగు భాషాభిమానులతో కలిసి గాంధేయ మార్గంలో నిరసన తెలుపుతామన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పురస్కారాలు పొందుతున్న వారు కూడా ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో చిన్న సూర్యనారాయణ, కొచ్చెర్లకోట సత్యనారాయణ, గంట్ల శ్రీనుబాబు, ధర్మావతి, హేమ, శ్రీధర్, ఎర్రంనాయుడు, రాజమన్నార్, చేబియ్యం మోహన్, శ్యామ్ సుందర్, మాధవి, విజయలక్ష్మి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# శారదమ్మకు ఘన నివాళి



శారదమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాస్తిక సమాజం ప్రతినిధులు

**ఆరిలోవ :** నాస్తిక సమాజం మహిళా నాయకురాలు శారదమ్మకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఐదో వర్ధంతిని ఆరిలోవలో నాస్తిక సమాజం ప్రతినిధులు నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ దృక్పథం కోసం శారదమ్మ కృషి చేశారన్నారు. విశాఖలో తొలిసారిగా ఆమె మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా నిప్పులపై నడిచి చూపించారన్నారు. శాస్త్రీయ ఆలోచన విధానం, మహిళా సమానత్వం అనే లక్ష్యాలను వ్యాపింపజేశారన్నారు. భారత నాస్తిక సమాజం స్థాపనలో డాక్టర్ జయగోపాల్‌ను ఆమె ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ సమన్వయకర్త జె.రవి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామమూర్తి, విప్లవ కవి ఉదయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్గత హ్యాక్‌థాన్ విజేతలకు బహుమతులు



విజేతలతో ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

**మద్దిలపాలెం :** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాక్‌థాన్ – 2025లో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజినీరింగ్, ఐటీ – సీఏ విభాగాలు సంయుక్తంగా 'ఫ్రమ్ బిట్స్ టు క్యూబిట్స్' అనే అంతర్గత హ్యాక్‌థాన్ నిర్వహించింది. ఇందులో మొత్తం 33 జట్లు పాల్గొన్నాయి. గాయత్రి విద్యా పరిషత్ (రుషికొండ క్యాంపస్) నుంచి 17, ఆంధ్ర యూనివర్సిటీ నుంచి 12, వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్ నుంచి 3, డాక్టర్ ఎల్.బి.కాలేజీ నుంచి ఒక జట్టు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతల బృందం ముందు అన్ని జట్ల సభ్యులు తమ ఆలోచనలను వివరించారు. మొదటి రౌండ్లో 15 జట్లు ఎంపిక కాగా, వారిలో నుంచి న్యాయ నిర్ణేతలు ఉత్తమమైన 6 జట్లను ఎంపిక చేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థుల బృందాలకు ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శుక్రవారం బహుమతులు అందించారు. కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ఆచార్య కె.వెంకట రావు, డీసీ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కె.శ్రీనివాస్‌రావు, రిసోర్స్ పర్సన్స్ సర్టిఫికెట్లు అందజేశారు. నూతన ఆలోచనలతో పోటీలో పాల్గొన్న విద్యార్థులను, విజేతలను ఏయూ వీసీ అభినందించారు.

# మేజర్ ధ్యాన్‌చంద్ ఘనత మరువలేనిది



ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, ఆచార్యులు, విద్యార్థులు



ధ్యాన్‌చంద్ జీవిత చరిత్రను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తున్న అధ్యాపకులు

**మద్దిలపాలెం :** భారతదేశానికి ఒలింపిక్స్ పురుషుల హాకీ విభాగంలో గోల్డ్ మెడల్స్ తెచ్చిన ఘనత మేజర్ ధ్యాన్‌చంద్‌దేనని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యాయామ విద్యా విభాగం శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా మొదటిసారిగా ధ్యాన్‌చంద్ విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత ఏయూదేనన్నారు. క్రీడా రంగానికి ధ్యాన్‌చంద్ అందించిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ ధ్యాన్‌చంద్ క్రీడా జీవితాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య జి.గిరిజాశంకర్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలనాయుడు, ఆచార్య ఎ.పల్లవి, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ, పోతురాజు, కరుణ, దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

- క్రిష్ణా డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం డాక్టర్ వి.ఎస్.క్రిష్ణా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పోరాట పటిమ, క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, కె.రవిబాబు, ఎం.రాజేశ్వరరావు, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.శ్రావణ్ కుమార్, ఇన్‌చార్జి పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాస్ ప్రసాద్ పాల్గొన్నారు.

### ఉత్సాహంగా స్వచ్ఛభారత్ ర్యాలీ



స్వచ్ఛభారత్ అభియాన్ ర్యాలీలో విద్యార్థులు

**మద్దిలపాలెం :** డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛభారత్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ సన్యాసినాయుడు, కమాండెంట్ పి.కిషోర్, డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్ పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యాన్ని డిజిటలైజేషన్ చేయాలి



విశాఖ వ్యాలీ స్కూల్‌లో సన్మాన గ్రహీతలతో వివిధ వేషధారణలో విద్యార్థులు



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు

**మద్దిలపాలెం :** గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జరా అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వీసీ రాజశేఖర్ పాల్గొని గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ స్వయంగా రాసిన «తెలుగు తల్లి మన వెలుగు తల్లి» కవిత చదివి వినిపించారు. అనంతరం ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని డిజిటలైజేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తొలి తెలుగు భాషావేత్తగా, అంతర్జాతీయ భాష శాస్త్రవేత్తగా, వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడిగా గిడుగు రామ్మూర్తి పంతులు విశేష సేవలందించారని కొనియాడారు. ప్రొఫెసర్ జరా అప్పారావు మాట్లాడుతూ భాషతో సమాజాన్ని రామ్మూర్తి పంతులు మేల్కొలిపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆచార్య గద్ద యోహాన్ బాబు, ఆచార్య ప్రేమానందం, ఆచార్య రాజ్ కన్నియ్య మురళి, కిషోర్, గంట్ల శ్రీను బాబు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు

- ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐ.ఎ.ఎస్.ఈ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ నగరాజ కుమారి తెలుగు భాష గొప్పతనంపై ఉపన్యసించారు. తెలుగుతల్లి, శ్రీకృష్ణ దేవరాయలు, గిడుగు రామ్మూర్తి పంతులు వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రధాన ఆచార్యులు డాక్టర్ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఘనంగా తెలుగు భాషా దినోత్సవం**

**ఆరిలోవ :** విశాఖ వ్యాలీ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు ఉపాధ్యాయుల వేషధారణతోపాటు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని జానపదాలు, అవధాన, నాటక, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంస్కృతం, సాహిత్యంలో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, అవధాని కట్టమూరు చంద్రశేఖరం, సాంఘిక శాస్త్ర బోధకురాలు, అంధుల కోసం శాస్త్రీయ సంగీత పుస్తకాన్ని బ్రెయిలీ లిపిలో రాసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన కొల్లూరు లక్ష్మీనారాయణమ్మను విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు శాస్త్రీయ, సాహితీ ప్రతిభ కలిగి ఉండాలన్నారు. తెలుగు భాషను గౌరవిస్తూ వేడుకలు నిర్వహించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయలను అభినందించారు.

# స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ఆర్థిక భారం



నిరసన తెలుపుతున్న కలాసీలు, నాయకులు

**డాబాగార్డెన్స్ :** విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ కళాసీలు శుక్రవారం నిరసన చేపట్టారు. టౌన్‌కొత్త రోడ్డు సమీపాన ఉన్న విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరిట కరెంట్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, కళాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పెంచిన కరెంటు చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. మరోవైపు అదానీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా స్మార్ట్‌మీటర్లు బలవంతంగా బిగించడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని కూటమి నాయకులు నినాదాలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వెంటనే అవే స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిటూ జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ప్లీనరీ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

**విశాఖ సిటీ:** 'సేనతో సేనాని' పేరుతో నిర్వహిస్తున్న జనసేన ప్లీనరీ నేపథ్యంలో శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు పలు సూచనలు చేశారు.

- ప్రజాప్రతినిధులు వాహనాల్లో ఆర్‌కే జంక్షన్ మీదుగా వచ్చి మున్సిపల్ స్టేడియం లోపల ఉన్న వీఐపీ పార్కింగ్ ప్రాంతంలో నిలపాలి.
- ద్విచక్ర వాహనాలపై వచ్చే పార్టీ కార్యకర్తలు/ప్రజలు కాన్వెంట్ జంక్షన్ నుంచి పోర్ట్ ఆర్చ్ ప్రధాన ద్వారం నుంచి లోపలకు వెళ్లాలి. అక్కడ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలంలో వారి వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. అక్కడి నుంచి నడుచుకుంటూ సీ హార్స్ జంక్షన్ మీదుగా మున్సిపల్ స్టేడియంలోకి వెళ్లాలి.
- ఆటో/కార్/బస్సుల్లో వచ్చే కార్యకర్తలు/ప్రజలు పోర్ట్ ఆర్చ్ ప్రధాన ద్వారం నుంచి లోపలకు వెళ్లి వేదాంత గేటు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి. అక్కడి నుంచి నడుచుకుంటూ సీహార్స్ జంక్షన్ మీదుగా స్టేడియంలోకి ప్రవేశించాలి.
- పూర్ణామార్కెట్, టౌన్ కొత్త రోడ్, ఓల్డ్ పోస్టాఫీస్, ఆర్‌కే జంక్షన్ మీదుగా మున్సిపల్ స్టేడియం వైపు ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- ప్లీనరీ సందర్భంగా శనివారం చౌల్ట్రీ మీదుగా పాత పోస్టాఫీస్ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులు /ఇతర వాహనాలన్నీ తిరిగి అదే మార్గంలో వెళ్లాలి.

# కనకమహాలక్ష్మికి విశేషంగా క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

**డాబాగార్డెన్స్ :** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించాలని, 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

**డాబాగార్డెన్స్ :** జీవీఎంసీ కార్యాలయం, సౌత్ జైల్ రోడ్డు, సెంట్రల్ పార్క్ పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, సెంట్రల్ పార్క్, సౌత్ జైల్ రోడ్డుపై బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలు రాత్రి పూట జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు, పోలీసులు గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ముఖ్యంగా వ్యభిచారం, గంజాయి, ఆల్కహాల్ సేవించడం తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తనిఖీలలో బహిర్గతమైందన్నారు. ఈ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నగరంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరంతరం పోలీస్, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీలో జోన్ – 4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్ విజేత బుల్లయ్య కళాశాల



విజేతలతో ప్రిన్సిపాల్ మంజుల, కిరణ్మయి తదితరులు

**డాబాగార్డెన్స్ :** మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దివస్ వేడుకలు శుక్రవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించినట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి తెలిపారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకుంటున్న ఈ సంవత్సరంలో థీమ్ ఆఫ్ ది నేషనల్ స్పోర్ట్స్ డే – 2025కి అనుగుణంగా వుమెన్ టేబుల్ టెన్నిస్ ఇన్విటేషనల్ టోర్నమెంట్ నిర్వహించారు. నగరంలోని ఏడు డిగ్రీ కళాశాలల నుంచి టీమ్స్ పాల్గొనగా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల జట్టు ప్రథమ స్థానంలో, సెయింట్ జోసెఫ్స్ వుమెన్ కాలేజ్ ద్వితీయ స్థానంలో, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్ అనేది యువత విజయానికి సోపానమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీఎల్ శిరీష, ఎస్.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నివేదిత, పాల్గొన్నారు.